క్లుప్తంగా

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జీవీఆర్ సంస్థ నిర్వాహకుడు వెంకటరమణ

ప్రొద్దుటూరు కల్చరల్ : అందరి సహకారంతోనే బలిజ కులాభివృద్ధి సాధ్యమని జీవీఆర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి జి.వెంకటరమణ తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరులోని కేఎస్ఆర్, సీఆర్‌సీ బలిజ కల్యాణ మండపంలో జీవీఆర్ ఉచిత బలిజ కుల వివాహ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యారేజ్ బ్యూరోలతో సంబంధం లేకుండా బలిజ వర్గీయులు నేరుగా వధూవరులను ఎంపిక చేసుకునేందుకే ఈ కార్యక్రమాలను రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో 60 మంది వధూవరుల తల్లిదండ్రులు పాల్గొనగా వారికి జీవీఆర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమాన్ని బలిజ సంఘం కార్యదర్శి అల్లం చంద్రశేఖర్ నిర్వహించారు. జి.రామకృష్ణ రాయల్, ఆవుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివ పార్వతుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో తాళిని చూపుతున్న వేద పండితులు

వల్లూరు : స్థానిక శ్రీ భవానీ శంకర ఆలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు ఆధ్వర్యంలో వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాన్ని, శ్రీచక్ర సహిత భవానీ మాతకు కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వల్లూరు శివరాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చింతకోటమ్మ తిరునాల ప్రారంభం

సుండుపల్లె (వీరబల్లి) : మండల పరిధిలోని చిన్న గొల్లపల్లె గ్రామ పంచాయతీ, పూజారివాండ్లపల్లె వద్ద వెలసిన ప్రాచీన గ్రామ దేవత చింతకోటమ్మ తిరునాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరునాల ఉత్సవాలలో భాగంగా గత 10 రోజులుగా గ్రామ పంచాయతీలోని పలు గ్రామాలలో భక్తుల దర్శనార్థం పల్లకీలో అమ్మవారిని ఊరేగించి ఆదివారం ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగుబ్యాలు పెట్టడం, పుట్ట పూజించుట, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం ఉదయం పుట్ట బంగారు తెచ్చుట, పొంగుబాలు పెట్టుట, తొగట వీర క్షత్రియుల వీరగాసి విన్యాసాలు, కల్లు పోయుట, ఆశాది వారిచే అమ్మవారి కథ చెప్పడం, గ్రామ ప్రజలు బోనాలు సమర్పించడం, రాత్రికి అంగరంగ వైభవంగా విద్యుత్ దీపాలంకరణలతో, చెక్కభజనలతో కోలాటాల మధ్య ఛాందినీ బండ్లు ఊరేగింపు జరుగనున్నాయి.

17 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం వైద్యులు 17మంది రోగులకు కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కంటి ఆసుపత్రిలో నిర్వహించిన వైద్యశిబిరానికి అన్నమయ్యతో పాటు సత్యసాయి జిల్లాలోని పలు నియోజకవర్గాల నుండి సుమారు 50మంది కంటిరోగులు విచ్చేశారు. కంటి వైద్యుడు సురేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం 50 మందికి పైగా రోగులకు కంటిపరీక్షలు నిర్వహించింది. వీరిలో 17 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఆపరేషన్లు నిర్వహించారు. అనంతరం గతంలో ఆపరేషన్‌లు చేయించుకున్న 35 మందికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ స్వరూప్‌గుప్తా, క్లబ్ మాజీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్‌బాషా, కంటివైద్యులు మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఎం.రాజగోపాల్‌రెడ్డితో పాటు ఆసుపత్రి సిబ్బంది, రోగుల సహాయకులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో చీడపీడల నివారణ

లక్కిరెడ్డిపల్లి : ఘన జీవామృతంతో మామిడిలో చీడపీడల నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారిణి సరస్వతి పేర్కొన్నారు. ఆదివారం దప్పేపల్లి పంచాయతీలోని కొండవాండ్లపల్లెలో 14 ఎకరాల మామిడి తోటకు ఘనజీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, జీవామృతం మామిడిలో చీడపీడలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మామిడిలో పూత, పిందె రాలకుండా కాయ వస్తుందని ఆమె తెలియజేశారు. రైతు సోమశేఖర్ రెడ్డి 14 ఎకరాలలో కషాయాలు ఉపయోగిస్తున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు అంజనమ్మ, చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఓటు వినియోగించుకోనున్న 14,935 పట్టభద్రులు, 1269 ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి 4 వరకు ఎన్నికల పోలింగ్ జరగనుంది. జిల్లా కేంద్రం నుంచి బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ సామగ్రి పోలింగ్ కేంద్రాలకు చేరింది. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 13,843 మంది, రాజుపాళెం మండలంలో 1092 మంది కలిపి మొత్తం 14,935 మంది పట్టభద్రులు ఓటు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 1234 మంది, రాజుపాళెం మండలంలో 35 మంది మొత్తం 1269 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. పట్టభద్రుల కోసం ప్రొద్దుటూరు పట్టణంలోని వసంతపేట మున్సిపల్ హైస్కూల్, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, రమణ మహర్షి హైస్కూల్, కొత్తి హైస్కూల్‌ల్లో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించి కొత్తి హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రాన్ని, రాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏఎస్పీ ప్రేరణా కుమార్ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు అన్ని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఇద్దరు వీఆర్‌ఓల చొప్పున ప్రొద్దుటూరు మండలానికి 32 మందిని నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు.

రాజుపాళెం : రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఇందిరా రాణి తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు. మండలంలో 1092 మంది పట్టభద్రుల ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 35 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆధ్వర్యంలో



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజుపాళెం ఎస్‌ఐ రాజగోపాల్ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మైదుకూరు : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనుంది. మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, చాపాడు, బి.మఠం మండల కేంద్రాల్లో పోలింగ్ ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మైదుకూరు మండలానికి సంబంధించి టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిరకల కోసం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను తహసీల్దార్ అనురాధ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అలీఖాన్, ఆర్‌ఐ రోహిత్ పరిశీలించారు. మైదుకూరు మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 4 పోలింగ్ కేంద్రాలను, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. కాగా పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండటంతో జంబో బ్యాలెట్ పేపర్, జంబో బ్యాలెట్ బాక్స్‌ను ప్రత్యేకంగా తయారు చేయించారు.

దువ్వూరులో..

దువ్వూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉద్యాయ ఎమ్మెల్సీ ఎన్నిలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ రామకుమారి ఆదివారం తెలిపారు. మండల కేంద్రమైన దువ్వూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 1113 మంది పట్టభద్రుల ఓట్లు, 61 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. సీఐ నరేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా



ఎన్నికల విధులకు హాజరైన పోలింగ్ సిబ్బంది

పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ అమరనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

బద్వేలు అర్బన్ : నేడు జరగనున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలతో ఆయా బూత్‌ల పీఓలు, ఏపీఓలు ఆదివారం మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. బద్వేలు మండలానికి సంబంధించిన పట్టభద్రుల ఓటర్ల కోసం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌లు ఏర్పాటు చేయగా ...బూత్ నెంబర్ 7లో 633 మంది పురుషులు, 373 మంది మహిళలు చొప్పున 1006 మంది, బూత్ నెంబర్ 8లో 806 మంది పురుషులు, 383 మంది మహిళలు చొప్పున 1189 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఒక బూత్ ఏర్పాటు చేయగా బూత్ నెంబర్ 6లో 125 మంది పురుషులు, 73 మంది మహిళలు కొప్పున 198 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే గోపవరం మండలానికి సంబంధించిన పట్టభద్రుల ఓటర్ల కోసం పట్టణంలోని ఫాతిమా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో రెండు బూత్‌లు ఏర్పాటు చేయగా బూత్ నెంబర్ 9లో 762 మంది పురుషులు, 367 మంది మహిళలు చొప్పున 1129 మంది, బూత్ నెంబర్ 10లో 707 మంది పురుషులు, 350 మంది మహిళలు చొప్పున 1057 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన బూత్ నెంబర్ 7లో 142 మంది పురుషులు, 65 మంది మహిళలు చొప్పున 207 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్కో బూత్‌లో ఒక పీఓ, ఇద్దరు ఏపీఓలు, ఒక ఓపీఓల చొప్పున 24 మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక ఫాతిమా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లను ఆదివారం ఆర్డీఓ కార్యాలయ ఏఓ జీవన్ చంద్రశేఖర్, గోపవరం తహసీల్దారు దామోదర్‌రెడ్డిలు పరిశీలించారు.

కాశినాయనలో..

కాశినాయన : స్థానిక నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు రామచంద్రుడు, ఎస్‌ఐ హరిప్రసాద్‌లు ఆదివారం పరిశీలించి పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక పోలింగ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

బి.కోడూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బి.కోడూరు ఎస్‌ఐ నస్రీన్ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేశారు. తహసీల్దారు విద్యాసాగర్, ఎస్‌ఐల పర్యవేక్షణలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకుమారి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్‌ఐ

మేదర్లకు శిక్షణ



శిక్షణ పొందుతున్న మేదరులు

మైదుకూరు : వెదుర్లతో వివిధ రకాల కళాకృతులు, బుట్టలు తయారు చేయడంలో మేదర వృత్తిదారుల సంక్షేమం, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మైదుకూరులో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వ సహకారంతో మేదర్లకు శిక్షణ ఇచ్చి జీ-20 సదస్సులో వారి నైపుణ్యాన్ని ప్రదర్శింపజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. రోజుకు 150 మందికి ఫ్లవర్‌వాజ్‌లు, బుట్టలు తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు తమ్మినేని రాఘవేంద్ర, కార్యదర్శి భావనాశి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

13 నుంచి ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

గోపవరం : రబీలో సాగైన వివిధ పంటలకు సంబంధించి ఈ-క్రాప్ వివరాలను ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి, బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. ఆర్బీకే సిబ్బంది గ్రామ సభలు నిర్వహించి ఈ-పంట నమోదు చేసిన రైతుల వివరాలను చదివి వినిపిస్తారని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు పూర్తైందని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమంలో ఆదివారం మధ్యాహ్నం డాక్టర్ మూరికూటి సూర్యనారాయణరెడ్డి, గంగా లక్ష్మమ్మ దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 21 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదల ఆకలిని తీర్చడం తమకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జనం కోసమే పుట్టింది

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జనం కోసమే పుట్టిందని, గత 12 ఏళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం గుండెల్లో నిలిచేలా పార్టీని నడిపిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అందరికీ పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి 8 ఏళ్ల ప్రతిపక్ష స్థానంలో ప్రజా సమస్యలపై పోరాటం చేశామన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేసిన ఫలితంగా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అధికారం చేపట్టిందన్నారు. నాలుగేళ్లుగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్నామని తెలిపారు. అవినీతి రహిత, దళారి వ్యవస్థ లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆర్థికాభివృద్ధిని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసమే పుట్టిందనడంలో సందేహం లేదన్నారు. పార్టీ దేనికోసం స్థాపించామో ఆ దిశగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం సమానంగా లబ్ధి చేకూర్చేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అసమానతలు తొలగించి అన్ని రంగాల వారికి మేలు చేకూర్చడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు. ఆ దిశగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాల్సి ఉందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పేదరికమే ప్రమాణికంగా రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షులు కామిసెట్టి బాబు, కోనేటి సునంద, జిల్లా ప్రచార కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి కాకర్ల నాగేషారెడ్డి, కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, దికోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, నాయకులు కంభం వెంకటేశ్వర్లు, రాగా నరసింహారావు, పాలగిరి ఖాజా, కౌన్సిలర్లు, మహిళా నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పార్టీ శ్రేణులు

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, అంకిరెడ్డి, వీరభద్రుడు, చిరాకి మహబూబ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దువ్వూరు : వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : పేదల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక నెల్లూరురోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ కేక్ కట్ చేసి మాట్లాడారు.

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన కోసం ఆవిర్భవించిన పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్త అంకిత భావంతో సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ సింగసాని గురుమోహన్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, పోలిరెడ్డి, మార్కెట్ కమిటీ



మహానేత వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయికృష్ణ, ఆయా మండలాల కన్వీనర్లు రామసుబ్బారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పుల్లయ్య, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, ఓబుల్‌రెడ్డి, పుత్తామహేష్, సత్యం, చెన్నయ్య, వార్డు ఇన్‌చార్జిలు, కో ఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బద్వేలు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీ పార్టీ ప్రజల పార్టీ అని, వారి సంక్షేమానికి నిరంతరం పాటు పడుతోందని ఆ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. అంతకు మునుపు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో వైఎస్ జగన్ పార్టీ స్థాపించి ముందుకు సాగారన్నారు. తదుపరి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని నిజమైన సంక్షేమ అమలు చేస్తూ తండ్రిని మించిన తనయుడిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని నడిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ సీ బాషా, వైస్‌ఎంపీపీ చెన్ను రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, కో అప్షన్ సభ్యులు అల్లా, పోరుమామిళ్ల, కాశినాయన బూత్ కమిటీల కన్వీనర్ కల్లూరు రమణారెడ్డి, గుండం హనుమంతరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, నాయకులు దేవసాని ఆదిత్యారెడ్డి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తదితరులు

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కలసపాడు : స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, నారాయణయాదవ్, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, ఎస్.లక్ష్మిరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, షరీఫ్, రాంబాబు, బాలవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు



తిప్పిరెడ్డిపల్లెలో బోనాలు తీసుకెళుతున్న మహిళలు

చాపాడు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఘనంగా గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో 30 ఏళ్ల తర్వాత గ్రామ ప్రజలందరూ ఏకమై జాతర వైభవంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై గంగమ్మ తల్లి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి గంగమ్మకు బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటికి పెద్ద ఎత్తున బంధువులు రావటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట

వేంపల్లె : కడప-పులివెందుల బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అర్చకులు శంకరమంచి ప్రసాదు శర్మ, వేద పండితులు విగ్రహాలను ప్రతిష్టించారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

కమలాపురం : ప్రతి ముస్లిం మహమ్మద్ ప్రవక్త (సా.అ.) జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన మౌలానా ముఫ్తి అహ్మదుల్లా నిసార్ ఖాస్మి తెలిపారు. స్థానిక ముస్లిం కమ్యూనిటీ షాదిఖానాలో నిర్వహించిన తన్‌జీముల్ మకాతిబ్ కమలాపురం కే జేరే ఎహ్‌తిమామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం మహ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవనం సాగించాలన్నారు. చాలా మంది పిల్లలు దీన్‌కు దూరంగా ఉంటున్నారని, కమలాపురంలో మదరసాలు ఏర్పాటు చేసి దీన్ గురించి వివరించడం సంతోషకరమన్నారు. సెల్‌ఫోన్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. వాటి వల్ల చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. బద్వేల్‌కు చెందిన మౌలానా ముఫ్తి



మాట్లాడుతున్న ముఫ్తి అహ్మదుల్లా నిసార్ ఖాస్మి

అబ్దుల్ హాది సాహెబ్, అనంతపురంకు చెందిన ముఫ్తి సైపుల్లా ముజాహిరి ప్రసంగించారు. అనంతరం సమావేశానికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని మదరసాల గురువులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించండి



సంద్రపల్లె చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు

గోపవరం : మండలంలోని టీ.సంద్రపల్లె చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించాలని ఆయకట్టు రైతులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కట్టకు ఇరువైపులా పెద్ద పెద్ద కంపచెట్లు ఉండటంతో కట్టకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 2020లో కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్టకు గండి పడి ఇప్పటి వరకు ఆ పనులు కూడా చేపట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాచాయపేట నుండి సంద్రపల్లె చెరువు కట్ట మీదుగా బుచ్చనపల్లె వరకు 5 గ్రామాలను కలుపుతూ రింగ్ రోడ్డు ఉంది. ఈ మార్గం ద్వారా గతంలో ఆర్టీసీ కూడా తిరుగుతుండేది. చెరువుకు గండి పడినప్పటి నుండి ఈ మార్గాన బస్సు నడవడం లేదు. ఇప్పటికే రింగ్ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయడం జరిగింది. చెరువు కట్ట పనులు కూడా చేపడితే ఈ మార్గాన బస్సు తిరిగే అవకాశం ఉందని ఈ ప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు కట్టకు ఉన్న కంపచెట్లను తొలగించాలని ఆయకట్టు రైతులతో పాటు ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.